

టీటీడీ విజిలెన్స్ మాజీ అధికారి అనుమానాస్పద మృతి

తాడిపత్రి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం లభ్యం
హత్య చేసి పడేసారన్న మృతుని కుటుంబసభ్యులు
టీటీడీలో సంచలనంగా మారిన పరకామణి కేసులో మృతుడు ప్రధాన సాక్షి

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్


సతీష్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

అనంతపురం జిల్లా తాడిపత్రి మండల పరిధిలోని కోమలిగ్రామం వద్ద రైల్వే ట్రాక్‌పై తిరుమలలో పనిచేసిన మాజీ విజిలెన్స్ అధికారి, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ (52) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి రైల్వే ట్రాక్ పక్కన పడి ఉండటాన్ని చూసిన స్థానికులు రైల్వే అధికారులకు తెలియజేయడంతో రైల్వే జి ఆర్ పి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు గతంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో విజిలెన్స్ సీనియర్ అధికారిగా పనిచేసిన సతీష్ కుమార్‌గా అని గుర్తించారు. ప్రస్తుతం సతీష్ కుమార్ గుంతకల్ జి ఆర్ పి లో రిజర్వ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మృతుడు టీటీడీలో సంచలనంగా మారిన పరకామణి కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడని ఆ కేసు తారుమారు చేయడం కోసమే హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

హత్య చేసి ట్రాక్ పక్కన పడేశారు : బాధితులు

తన అన్నను హత్య చేసి ట్రాక్ పక్కన పడేశారని ఇది ముమ్మాటికి హత్యే అని మృతుడు సతీష్ కుమార్ తమ్ముడు హరి ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో టీటీడీలో పనిచేసే సమయంలో అక్కడి పరకామణి సేవలో జరిగిన దొంగతనం కేసులో సతీష్ కుమార్ ప్రధాన సాక్షిగా ఉన్నారన్నారు. ఈ ఏడాది నవంబర్ 6న టీటీడీలోని పద్మావతి గెస్ట్ హౌస్ నందు విచారణ చేశారని అదే కోణంలో మరొక మారు సిఐడి ఆధ్వర్యంలో విచారణకు రావాలని తెలిపారన్నారు. దీంతో సిఐడి విచారణకు హాజరయ్యేందుకు గురువారం రాత్రి వెళ్లే సమయంలో కేసును తారుమారు చేసేందుకు తన అన్నను హత్య చేసి ట్రైన్ కిందపడి ఆత్మహత్య గా చిత్రీకరించారని ఆరోపించారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హరి తెలిపారు.సంఘటనాస్థలాన్ని ఐజి షిమోషీ, ఎస్పీ జగదీష్, రైల్వే పోలీసులు పరిశీలించారు.

విచారణ జరపాలి : టిటిడి బోర్డు మెంబర్ ఎమ్మెస్ రాజు

మడకశిర టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి చోరీ కేసుపై ఫిర్యాదు చేసిన టీటీడీ మాజీ విజిలెన్స్ అధికారి సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని టీటీడీ పాలకమండలి సభ్యులు, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. పరకామణి చోరీకి సంబంధించిన కీలక పాత్రధారులు, సూత్రధారులు ఈ కేసు నుండి బయటపడేందుకు కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్‌ను హత్యచేసి, తాడిపత్రిలోని రైల్వే ట్రాక్ మృతదేహాన్ని పడేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని కోరారు. పరకామణిలో హుండీ డబ్బులను చోరీ చేసిన రవికుమార్, అతని వెనుక ఉన్న భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మరికొంత మంది సూత్రధారులు, పాత్రధారుల విషయాలపై ఆరా తీయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. పరకామణి కేసు విచారణ చివరిదశకు వచ్చిన తరుణంలో టీటీడీలో తన వాంగ్మూలం ఇచ్చేందుకు బయలుదేరిన సతీష్‌కుమార్ తాడిపత్రి సమీపంలోని కోమలి రైల్వే ట్రాక్ పై శవమై తేలడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో జరిగిన దుర్మార్గాలకు సంబంధించిన సాక్షులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం


ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

విఐపిలు రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత
మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు
సర్వాంగ సుందరంగా ముస్తాబైన పుట్టపర్తి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్, రూరల్

శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాలను సర్వం సిద్ధమైంది. ఉత్సవాలు సవ్యంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లపై పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఐఅండ్ పిఆర్ తో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, మొత్తం కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఒఎం) ను నియమించిందని తెలిపారు. వారు ఇప్పటికే సమీక్షించి అనేక కీలక సూచనలు అందజేశారని వివరించారు. పుట్టపర్తికి వచ్చే భక్తుల కోసం రైల్వే స్టేషన్ నుండి ప్రశాంతి నిలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి రవాణా సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే సమీప ప్రాంతాల నుండి దాదాపు 300 అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, యాత్రికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచనున్నామని కలెక్టర్ తెలిపారు. రైల్వే శాఖ ద్వారా 165 స్పెషల్ రైళ్లు నడపనున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో యాత్రికులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. భోజన వసతులు, మెడికల్ క్యాంపులు, తాగునీటి ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాల్లో ప్రత్యేక ఫుడ్ కౌంటర్లు, అన్ని పార్కింగ్ ప్రాంతాల్లో రాత్రి వేళ అవసరమైన లైటింగ్ సదుపాయాలు వృద్ధులు, వికలాంగులకు మినీ బస్సుల ద్వారా ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించామన్నారు. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో 300 మంది శానిటేషన్ వర్కర్లు, సూపర్వైజర్లు నియమించి పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఈ నెల 19 నుండి 23 వరకు నిర్వహించనున్న సత్యసాయి శతజయంతి వేడుకలకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అనేక మంది ప్రముఖులు పుట్టపర్తి వచ్చే అవకాశముందని చెప్పారు. వారి రాకపోకల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక రవాణా సౌకర్యాలు సిద్ధం చేశామని తెలిపారు. పుట్టపర్తి మొత్తం ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు, భద్రత బలోపేతం చేసేందుకు 5 వేల మంది పోలీసులు షిఫ్టుల వారీగా విధుల్లో నియమించామని చెప్పారు. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా వేగంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగం సిద్ధం ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 ప్రకారం పర్యవేక్షణ చేస్తారని, అదేవిధంగా పట్టణం చుట్టుప్రక్కల 250 నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. యాత్రికులు ఏదైనా సమాచారానికి లేదా సహాయానికి 1800 233 5598 నంబరుకు కాల్ చేసి సంప్రదించవచ్చు అన్నారు. అనంతరం ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ ను కలెక్టర్ సందర్శించి స్టేషన్ లోపల, వెలుపల ఏర్పాట్లను పరిశీలించారు. రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి రావడానికి ఉచిత బస్సులు ఏర్పాటు, అక్కడి ప్రదేశంలో వాహనాలు, కార్లు, బస్సుల పార్కింగ్, త్రాగు నీటి వసతి, ఉచిత వైద్య శిబిరం తదితరాలను పరిశీలించి, తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై సూచనలు జారీ చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రశాంతి నిలయం వరకు రహదారి ఇరువైపులా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి, విధులలో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పనిని పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం దాటాక శిల్పారామానికి వెళ్లే దారిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఆర్టీసీ, మున్సిపల్, పంచాయతీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 7.20 కోట్ల వ్యయంతో విద్యుత్ వ్యవస్థ బలోపేతం

శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఎస్‌పిడిసిఎల్ నడుం బిగించింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే పుట్టపర్తిలో విద్యుత్ వెలుగులను విరజిమ్మేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ప్రణాళికతో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసింది. జయంతి ఉత్సవాల సమయంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని అంచనావేసిన ఎపిఎస్‌పిడిసిఎల్ అందుకనుగుణంగా విద్యుత్ సబ్-స్టేషన్, ట్రాన్స్ ఫార్మర్లు, లైన్ల వంటి విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. నిరంతరాయ విద్యుత్ సరఫరాను కొనసాగించేందుకు పవర్ బ్యాకప్ సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచింది. సరఫరాలో అంతరాయం తలెత్తితే సరఫరా పునరుద్ధరణ కోసం 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేసింది. పుట్టపర్తి సాధారణ విద్యుత్ వినియోగం 6 మెగావాట్లు ఉండగా గరిష్ట లోడ్ 8 మెగావాట్లుగా నమోదవుతోంది. అయితే వేడుకల సందర్భంగా వినియోగం 10 మెగావాట్లకు చేరుకుంటుందనే అంచనాతో అందుకు తగ్గట్టుగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు(ఎస్ఎస్-ఎస్‌సిటీ) కోసం ప్రత్యేకంగా వెంగలామచెరువు వద్ద 33/11 కెవి సబ్-స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. లోడ్ ను సమర్థవంతంగా భరించేందుకు వీలుగా సబ్-స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పుట్టపర్తిలో మందిరం ప్రాంగణంలో ఎపిఎస్‌పి డిసిఎల్ రూ.128.50 లక్షల వ్యయంతో 5 కిలోమీటర్ల మేర 34ఎస్క్యూఎంఎం స్థానంలో 55 ఎస్క్యూఎంఎం కండక్టర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న 40 ఎబి స్విచ్ ల స్థానంలో కొత్త వాటిని అమర్చారు. అలాగే జర్మన్ హ్యాంగర్ వంటి తాత్కాలిక షెడ్లకోసం 100, 160 కెవిఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్ ఫార్మర్లను కూడా ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ విధులకు ఆటంకం ఏర్పడకుండా పోలీస్ కార్యాలయం వద్ద ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యాన్ని 100 కెవిఏ నుంచి 160 కెవిఏకి పెంచారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద 100 కెవిఏ ట్రాన్స్ ఫార్మర్, సందీప్ బెల్ వ్యూ లే-అవుట్, వెస్ట్ గేట్, ఇతర పోలీసు వసతి ప్రాంతాల్లో కూడా కొత్త ట్రాన్స్ ఫార్మర్లను, లైన్లను ఏర్పాటు చేశారు. పుట్టపర్తిలో పట్టణంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు వీలుగా ఎపిఎస్ పిడిసిఎల్ రూ.1.07 కోట్ల వ్యయంతో అదనపు ట్రాన్స్ ఫార్మర్లను, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, తక్కువ ఎత్తులో వున్న ట్రాన్స్ ఫార్మర్ల దిమ్మెల ఎత్తును పెంచడం, విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయడం, లైన్లను సరిచేయడం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేశారు. ఇక పార్కింగ్ ప్రాంతాల్లో కూడా రూ.13.60 లక్షల వ్యయంతో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరిచారు. శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల సందర్భంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఎస్‌పిడిసిఎల్ తగిన చర్యలు తీసుకుందని ఆసంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకుని, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే ధ్యేయంగా 150 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సిబ్బందిని నియమించడంతోపాటు 60 మంది కాంట్రాక్టు సిబ్బందిని సేవలకు అందుబాటులో వుంచామని వివరించారు.

17 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23వరకు స్థానిక శిల్పారామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు వివిధ ప్రముఖ సంగీత నృత్య కళా సంస్థల ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే స్థానిక శిల్పారామంలో ఈనెల 15 నుండి 25 వరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత డ్వాక్రా బజార్- 2025 ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేసిన చేనేత హస్త కళలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనచ హస్తకళలు, గృహ అలంకరణలో చేనేత ఉత్పత్తులు డ్వాక్రా బజార్లో అమ్మకాల నిమిత్తం స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఉత్సవాల సందర్భంగా పట్టణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు డిఎస్పి విజయ్ కుమార్ తెలిపారు


ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

వార్త రాసిన విలేకరిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

ఆగని అధికారపార్టీ నాయకుల ఆగడాలు

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలో నాసిరకం రోడ్డు నిర్మాణపు పనులు జరుగుతున్నాయని వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరి శంకర్ పై ఎస్సీఎస్టీ కేసును అధికారపార్టీ నేతలు బనాయించారు. వాస్తవానికి వార్త రాసిన విలేకరి శంకర్‌పై నాగరాజు యాదవ్, ఆయన కుమారుడు హరిష్ యాదవ్‌లు దాడి చేశారు. ఈ దాడిలో శంకర్‌కు గాయాలయ్యాయి. దీనిపై ఈనెల 10వ తేదీన శంకర్ చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు చేసిన తరువాత నాగరాజు యాదవ్ కూడా తనపై శంకర్ దాడి చేసాడని ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇద్దరిపైనా కేసులు నమోదు చేశారు. ఇక అంతటితోనే ఆగకుండా ఈనెల 13వ తేదీన విలేకరి శంకర్‌పై ఏకంగా ఎస్సీ,ఎస్టీ అట్రిసిటి కేసును నమోదు చేశారు. ఘటన జరిగిన మూడు రోజుల తరువాత రోడ్డు పనులు చేస్తుంటే విలేకరి శంకర్ వచ్చి తనను బెదిరించి, కులంతో దూషించాడని దళిత సూర్యనారాయణ అనే వ్యక్తి చేత ఫిర్యాదు చేయించారు. దీనిపైనా పోలీసులు శంకర్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయడం గమనార్హం.

తప్పుడు కేసులు బనాయించడం సరైంది కాదు : ఎపిడబ్లుజెఎఫ్

విలేకరి శంకర్ వార్త రాసాడనిఅధికారపార్టీ నేత నాగరాజు యాదవ్, ఆయన కుమారుడు హరిష్ యాదవ్ బెదిరించడమే కాకుండా దాడి చేసి తీవ్రం గాయపరిచారని పైగా అతడిపైనే తప్పుడు కేసులు బనాయించడం సరైంది కాదని ఎపిడబ్లుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.షఫివుల్లా పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణం కేసులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి : సిపిఎం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రామకృష్ణతో పాటు రామకృష్ణ, రైతు సంఘ జిల్లా నాయకులు హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొక్కజొన్న రైతులు అధికంగా ఉన్నారని ప్రస్తుతం మొక్కజొన్న రైతుల దగ్గర సిద్ధంగా ఉందని అన్నారు, అయితే మొక్కజొన్న రేటు అనూహ్యంగా తగ్గిపోయిందని ప్రభుత్వం వెంటనే స్పందించే మొక్కజొన్న రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రూ. 2500 నుంచి ఒక్కసారిగా రూ.1600లకు పడిపోయిందని అన్నారు. దీంతో రైతులు దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుత ధరలకు పెట్టుబడి కూడా రాదని రైతులు వాపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హనుమయ్య, ఎం వెంకటేష్, బి వెంకటేష్, లక్ష్మీనారాయణ, కొండా వెంకటేష్, మాబు, రామాంజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ స్వాతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న పంటను అధికంగా పండించారన్నారు. సాగుకు నగలను తాకట్టు పెట్టి అప్పులు చేసారన్నారు. పంట పెట్టుబడి ఖర్చులు పెరిపోయాయి కానీ గిట్టుబాటు ధర లేదని అన్నారు. దళారులు రూ.1650 నుంచి రూ. 1750 కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి క్వింటా రూ. 2,600తో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయం పై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినవించుకున్న స్పందన లేదన్నారు. తక్షణం ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాబా వలి,సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర, సుధాకర్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూడు రోజులపాటు ఎమ్మెల్యే పర్యటన

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ శనివారం నుండి మూడు రోజులపాటు హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే శనివారం కొడికొండ హిల్స్ గెస్ట్‌హౌస్‌లో అధికారులు, నాయకులతో నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హిందూపురం మండలం మలుగూరులో రూ.26. 5 లక్షలతో నిర్మించిన పశువుల ఆసుపత్రిని, పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే హిందూపురం మున్సిపాలిటీ లో రూ.92.50 కోట్లతో పట్టణ వ్యాప్తంగా నిర్మించనున్న రహదారులు, మురుగుకాలువల ఏర్పాటు కోసం బాలాజీ సర్కిల్ లో పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ముద్దిరెడ్డిపల్లి లో చౌడేశ్వరి కల్యాణమండపంలో హ్యాండ్ లూమ్స్, టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో సబ్సిడీ కింద మంజూరు అయిన చేనేత పరికరాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం మాజీముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణకు హాజరవుతారు. సోమవారం ఉదయం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 38 మందికి రూ.45 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తారు. 10 గంటలకు పట్టు పరిశ్రమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.


సమావేశంలో మాట్లాడుతున్న తాయి శ్రీనివాసులు

శ్రీతాయి జ్యువెల్లర్స్ యజమాని ఔదార్యం

వంద మంది విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి-గాండ్లపెంట

వంద మంది పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును కదిరి పట్టణంలోని శ్రీతాయి జ్యువెల్లర్స్ యజమాని శ్రీనివాసులు చెల్లించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం హెచ్ఎం టి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన పాల్గొని మొత్తం రూ. 12,500ను హెచ్ఎంకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కరువు కాటకాలకు నెలవైన కదిరి ప్రాంతంలోని పేద విద్యార్థులకు తన వంతుగా సాయం చేయడంతో భాగంగా పరీక్ష ఫీజు చెల్లించానని తెలిపారు. అనంతరం మల్లమీదపల్లి జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి రూ. 20వేలు విలువ చేసే కుర్చీలు, బల్లలు, తదితర సామగ్రి అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసులును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణానాయక్, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్‌అలీ విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో చోరీ....

రూ. 70వేలు విలువ చేసే మానిటర్, బ్యాటరీలు చోరీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ నడిబొడ్డున...రహదారి పక్కన మేళాపురం సర్కిల్ తెలుగు తల్లి విగ్రహం సమీపంలో ఉన్న సచివాలయాల్లో వరస చోరీలు జరుగుతున్నాయి. గత నెల రోజుల క్రితం ఆధార్ కార్డు అప్డేట్ కు సంబంధించిన కంప్యూటర్ బ్యాటరీలు చోరీ అయ్యాయి. తాజాగా ఇదే సచివాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడి రెండు బ్యాటరీలు, ఒక మానిటర్ ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది వన్ టౌన్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పాటు మున్సిపల్ కమిషనర్ దృష్టికి సైతం సిబ్బంది తీసుకెళ్లారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సచివాలయాలు ఉండేవి. పాఠశాలల ఆవరణంలో సచివాలయాలు ఉండకూడదని న్యాయస్థానం ఆదేశించడంతో మేళాపురం సర్కిల్ వద్ద ఖాళీగా ఉన్న మీసేవ భవనంలో 31, 32, 33, వార్డులకు సంబంధించిన మూడు సచివాలయాలను ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఈ సచివాలయాల్లో వరుసగా చోరీలు జరుగుతుండడంతో ఇక్కడ పనిచేసే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. రెండుసార్లు జరిగిన చోరీలలో సుమారు రూ. 70 వేలు విలువ చేసే సామాగ్రి చోరీకి గురైనట్లు సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ భూమిపూజ

ప్రజాశక్తి-రొద్దం

ఎంపీ బికె.పార్థసాధి శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. చిన్నమంతూరు గ్రామంలో ఎంపీ నిధులు రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన ఆంజనేయస్వామి ఆల య కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకుముందు ఎంపీకి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి యాపిల్ కాయల గజమాల వేసి సత్కరించారు. రొద్దంలోని బిసి కాలనీలో ఉన్న మసీదులో ఎంపీ నిధులు రూ. 6.5 లక్షలతో చేపట్టిన వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసులు, ఏఈ సూర్య, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నీలావతి, జివిపి.నాయుడు, సత్తి, నారాయణ, నాగరాజు, రాము, సత్యశేఖర్, పవన్, నరేష్, ముతవల్లి కలీమ్, ఉన్నారు.

ఎంపిడిఒగా దామోదరమ్మ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ ఎంపిడిఒగా దామోదరమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గార్లదిన్నె మండలంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు ఉద్యోగోన్నతిపై హిందూపురం మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ దామోదరమ్మ

బాలల హక్కులపై చైతన్యం రావాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

బాలలకు సంబంధించి చట్టంలో ప్రత్యేక హక్కులు ఉన్నాయని, వాటిపై అటు ఉపాధ్యాయులు ఇటు తల్లిదండ్రులు అవగాహన కల్పించు కోవాల్సిన అవసరం ఉందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని దుర్గాబాయి దేశ్ ముఖ్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆమెతో పాటు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ బాలల కోసం ప్రత్యేకంగా చట్టాలు ఉన్నాయన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, రవిచంద్ర, మురళి, నవేరా, గురునాథ్, అజయ్, పాఠశాల హెచ్ఎం సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మణేసముద్రంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి కళాశాల ఏఓ బి. గంగిరెడ్డి ర్యాలీకి ముందు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ప్రోగ్రాం ఆఫీసర్ కేశవరెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన

జిల్లాలో మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 2,600 గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తహశీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. తనకల్లులో జాతీయ రహదారిపై మొక్కజొన్న ధాన్యం పోసి నిరసన తెలిపారు.

ముదిగుబ్బ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. పెద్దన్న మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 2,600తో కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, సహాయ కార్యదర్శి ఖాదర్‌వలి, సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్, ఆవాజ్ కార్యదర్శి బాబ్‌జాన్, సిఐటియు కో కన్వీనర్ ముస్తఫా, రహీం, పక్కీరప్ప, నౌషాద్, పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మొక్కజొన్న రైతుల సమస్యలపై పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. సంఘం నాయకులు మారుతి, సిపిఎం నాయకులు టి.అయూబ్‌ఖాన్, ఎస్‌హెచ్.బాషా మాట్లాడుతూ మొక్కజొన్న రైతుల కష్టాలను ఏకరువు పెట్టారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.ఆదినారాయణ, హరి, నరసింహారెడ్డి, నాగరాజు, రామన్న పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ, వరి, తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో దేవేందర్‌నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో చిక్కుకొని అప్పుల పాలవుతున్నారన్నారు.


ముదిగుబ్బలో మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, నాయకులు


తనకల్లులో జాతీయ రహదారిపై మొక్కజొన్న ధాన్యం పోసి నిరసన తెలిపిన నాయకులు


ధర్మవరంలో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తనకల్లు : తనకల్లులో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై మొక్కజొన్న ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు గిట్టుబాటు ధర లేక సతమతమవుతున్నారన్నారు. ఇదే అదునుగా తీసుకున్న దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 2600తో కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని, రబీ సీజన్‌లో విత్తన వేరుశనగను 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. యూరియా కొరతను నివారించి ప్రతి రైతుకు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వివి.రమణ, శివన్న, సిఐటియు నాయకులు వేమన్న, వెంకటరమణ, రామచంద్ర, రమణ, శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా సభ్యులు తిరుమల కొండ శ్రీరాములు ఆధ్వర్యంలో రైతులు తహశీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఆయన దేశవ్యాప్తంగా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మండలాల వారీగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మొక్కజొన్నకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టిడిపిలో కార్యకర్తలే నిర్ణయాధినేతలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర టౌన్

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే అధినాయకత్వం, నిర్ణయాధినేతలు అని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల సభ్యుల నియామకాలపై వారి చేత శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా టిడిపి జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. పదవులు పొందిన వారు అందరిని సమన్వయం చేసుకుని గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. మడకశిరకు ఆర్టీఓ కార్యాలయం, డిఫెన్స్ పరిశ్రమ, సోలార్‌పార్క్ మంజూరయ్యాయన్నారు. హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు తీసుకొస్తామన్నారు. వక్క మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏడాది లోపు రైల్వేస్టేషన్ పనులు పూర్తయి రైళ్లు రాబోతున్నాయన్నారు. పుట్టపర్తి నుంచి హిరియూర్, కొడికొండ చెక్ పోస్ట్ నుంచి శిరా వరకు 4 వరుసల నేషనల్ హైవే మంజూరైందన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, తిప్పేస్వామి


సచివాలయం వద్ద వృథాగా పడేసిన మొక్కలు

ప్రభుత్వ ఆశయానికి తూట్లు..!

రొద్దం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ ఆశయం నీరుగారిపోతుందన్న విమర్శలు ఉన్నాయి. ఇందుకు మండలంలోని తురకలాపట్నం సచివాలయం వద్ద పదుల సంఖ్యలో మొక్కలను వృథాగా పడేయడమే ఉదాహరణ. వీటిని చూసిన ప్రజలు మొక్కలను ఇలా పడేయకుండా సచివాలయం పరిసరాల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్

మధుమేహంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఫైరోజ్ బేగం సూచించారు. 'ప్రపంచ మధుమేహ దినోత్సవం' సందర్భంగా శుక్రవారం పట్టణంలోని డిఎం హెచ్‌ఒ కార్యాలయంలో 'జీవనశైలి మార్పులతో వచ్చే అసంక్రమిత వ్యాధుల నివారణ'పై డిఎంహెచ్‌ఒ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు-వాటి నివారణ, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, పొగాకు, మద్య నిషేధం, తదితర వాటి గురించి వివరించారు. జిల్లాలో మధుమేహం పెరుగుదల ఆందోళనకర స్థాయిలో ఉందని తెలిపారు. 'మన ఆరోగ్యం-మన బాధ్యత' సందేశాన్ని పునరుద్ఘాటిస్తూ తక్కువ ఉప్పు-నూనె వాడకం, ఇంటి వంట, నిత్య వ్యాయామం, యోగా-ధ్యానం, చెడు అలవాట్ల నివారణ వంటి చర్యలను ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డా. మధుసూదన్, డిఐఒ డా. సురేష్‌బాబు, డిపిఎంఒ డా. నాగేంద్రనాయక్, డా. సునీల్, ఎపిడెమియాలజిస్ట్ బాలాజీనాయక్, కార్యాలయ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.


మధుమేహంపై చేపట్టిన ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ

గాండ్లపెంట ఎంపిడిఒగా టి.రామకృష్ణ



గాండ్లపెంట : మండల నూతన ఎంపిడిఒగా శుక్రవారం టి.రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. నల్లచెరువు ఎంపిడిఒ కార్యాలయంలో పని చేస్తున్న ఈయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి ఎంపిడిఒగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరి సహకారంతో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎంపిడిఒకు ఈఓఆర్‌డి సుజిత, సీనియర్ అసిస్టెంట్ ఎన్.అమీర్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ సిద్ధిక్ మహబూబ్‌బాషా, కంప్యూటర్ ఆపరేటర్ జయసింహ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు : మండల నూతన ఎంపిడిఒగా ఎన్.అశోక్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బుక్కపట్నం డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేస్తున్న అశోక్‌కుమార్‌రెడ్డి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపిడిఒను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంఇఒలు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


ఎన్.అశోక్‌కుమార్‌రెడ్డి

డిసిఇబిగా గోపాల్



కొత్తచెరువు : జిల్లా సాధారణ పరీక్షల మండలి సెక్రటరీగా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపాల్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం డిఇఒ జి.కృష్ణప్ప ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన లక్ష్మీనారాయణ

పుట్టపర్తి అర్బన్ : శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు చిన్నపొళ్ల లక్ష్మి నారాయణ, ఆయన కుమారుడు సంతోష్ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జెసి మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరస్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో సువర్ణలను వారి ఛాంబర్‌లో కలిసి స్వామి వారి ప్రసాదం అందజేశారు. వారి వెంట అంబులెన్స్ రమేష్ ఉన్నారు.


ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని నిజాంవలి కాలనీలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్(గ్రీవెన్స్)కు విశేష స్పందన లభించిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ మురళీకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పివి.పవన్ కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యకుడు డైమండ్ ఇర్ఫాన్, స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, వైస్ చైర్మన్లు రాజశేఖర్‌ఆచారి, బాబయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలను పక్కదోవ పట్టించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి సంబంధించిన వ్యక్తులు ఏ తప్పు చేసినా కూడా వెంటనే ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, సమస్యను పక్క పక్కదోవ పట్టించడమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్.రవిశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వాగేష్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ బాపట్ల టిడిపి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు సుబ్రహ్మణ్యం గుప్తా కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన గోమాంసం బయటపడగా, దానిని కప్పి పుచ్చడానికే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ హెలికాప్టర్‌లో వెళ్లి మరీ పెదిరెడ్డి పొలం ఫొటోలు తీయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిలను శుక్రవారం పుట్టపర్తిలో మాజీ సర్పంచి మస్తాన్‌వలి, దర్గా కమిటీ మేనేజర్ మాణిక్యం బాబా మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. టిడిపి కోసం తాను చేసిన సేవలను గుర్తించి దర్గా కమిటీ మేనేజర్‌గా నియమించినందుకు మాణిక్యం బాబా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సైకిల్ షాప్ బాబా, ఇమామ్, బషీర్, షఫీ, బాషా, రిజ్వాన్ పాల్గొన్నారు.

17న గ్రీవెన్స్ రద్దు

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో ఈ నెల 17వ తేదీ నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో దేశ ప్రధానితో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు వస్తున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమైన సందర్భంగా గ్రీవెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

తలుపుల : మండలంలోని కుర్లి గ్రామ పంచాయతీకి చెందిన టిడిపి కార్యకర్త గంగాధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటు న్నారు. ఈ విషయం తెలిసి టిడిపి నాయకులు ఆ గ్రామం వెళ్లి గంగాధర్‌ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేడా శంకర్, గంగరాజు, శ్రీశైలం రమణ, దేవేంద్ర నాయక్, శివారెడ్డి, సాయి, బాబు, ఆది, అశోక్, కదిరప్ప, శివకేశవ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తలుపుల : మండలంలోని గంజివారి పల్లి గ్రామ ఎస్సీ కాలనీలో నడివీధి గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ డికే.బాబు రూ.15వేల, సీనియర్ నాయకులు ఆవుల వివేకానందరెడ్డి రూ.10వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-బుక్కపట్నం

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని అభయ ఫౌండేషన్ ఫౌండర్ బాలచందర్ సూచించారు. ఫౌండేషన్ సహకారంతో రూ. 2 లక్షల వెచ్చించి స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ చుట్టూ ఐరన్ గ్రిల్, ఫాన్స్, లైట్స్ ఏర్పాటు చేయించారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా సేవాస్ఫూర్తితో జిల్లాలోని వివిధ పాఠశాలలకు తమ ఫౌండేషన్ ద్వారా తమ వంతు చేయూతనందిస్తున్నామన్నారు.

నెహ్రూకు కాంగ్రెస్ నేతల నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. వారు మాట్లాడుతూ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తొలి ప్రధానిగా నెహ్రూ దేశానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కేశగాళ్ల వెంకటేష్, రాజు, గణేష్, అనిల్, వెంకటేష్, రామాంజనేయులు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.


పరిగిలో నెహ్రూకు నివాళులర్పిస్తున్న కెటి.శ్రీధర్, తదితరులు

పరిగి : దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలను కొనసాగించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎఎం లింగన్న విద్యాసంస్థల ఛైర్మన్ కెటి.శ్రీధర్ సూచించారు. నెహ్రూ జయంతి సందర్భంగా సేవామందిర్‌లోని పాఠశాలల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రామలింగప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల ధర్నా


ప్రజాశక్తి-గుడిబండ

నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ భోజనం నాణ్యతగా ఉండడం లేదని, సాంబార్‌లో పురుగులు పడినా ఏజెన్సీ నిర్వాకులు పట్టించుకోవడం లేదని, దీంతో పస్తులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా ప్రయోజనం లేదన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఎంపిడిఒ కేశవరెడ్డి, ఎంఇఒ ప్రసాద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్‌తో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఘనంగా ప్రాథమిక సహకార సంఘం వారోత్సవాలు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం వారోత్సవాలు నిర్వహించారు. సంఘం అధ్యక్షులు సి.గోపాల్ రెడ్డి, పూల గంగాధర్, నబి రసూల్ మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సహకార సంఘంలో ప్రభుత్వం రైతులకు రాయితీతో ఎరువులు అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 72వ అఖిల భారత వారోత్సవాలు నిర్వహిస్తూ జెండా వందనం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వెంకటాచలం, అసిస్టెంట్ మేనేజర్ గోవింద్‌రెడ్డి, యశోద, పిఎసిఎస్ సీఈఓ జగన్మోహన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, అజమతుల్లా, గిరిధర్‌గౌడ్, రాజారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.


గోరంట్లలో జెండా వందనం చేస్తున్న సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లు, సిబ్బంది

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా 58వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా మొదటి రోజైన శుక్రవారం శాఖా గ్రంథాలయాల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


రొద్దం గ్రంథాలయంలో వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

రొద్దం : స్థానిక గ్రంథాలయంలో మొదటి రోజు ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి హెచ్. నాగరాజు తెలిపారు. అలాగే బాలల దినోత్సవం, జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించా. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, గోకుల్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని గ్రంథాలయంలో కమిటీ అధ్యక్షులు ఆదినారాయణ అధ్యక్షతన వారోత్స వాలు నిర్వహించారు. ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని, తద్వారా జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ శ్రీరాములు, శ్రీనివాసగుప్తా, నరహరిమూర్తి, లక్ష్మీదేవి, గ్రంథాలయ అధికారి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పర్వీన్‌భాను ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయుడు శివరామరాజు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక గ్రంథాలయంలో అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ఎంఇఒ, హైస్కూల్ హెచ్‌ఎం రవీంద్ర, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ వారోత్సవాలు గురించి వివరించారు.

కొత్తచెరువు : గ్రంథాలయాలను విద్యార్థులు, పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఎంసి.రమేష్ నాయక్ సూచించారు. వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ జయంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాజుల నాగేంద్రప్రసాద్, రిటైర్డ్ ఎంపిడిఒ మహమ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్‌నగర్‌లో ఉన్న ప్రధాన పౌరశాఖ గ్రంథాలయంలో అధికారిణి అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్ నాయక్, గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే గ్రంథాలయ బ్రోచర్‌ను విడుదల చేశారు. విద్యార్థుల చేత పద్యాలు, పాటలు పాడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం ముత్యాలప్ప, ఎల్‌ఐసి ఏజెంట్ నాగరాజు, గ్రంథాలయ సిబ్బంది రాములునాయక్, సరస్వతమ్మ, గంగాధర్, రాజారెడ్డి, కేశవ, శ్రీకాంత్ పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక గ్రంథాలయంలో అధికారిణి రాజేశ్వరి ఆధ్వర్యంలో వారోత్సవాలు, బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


లేపాక్షిలో నెహ్రూకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

లేపాక్షి : స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియా డారు. పిల్లలతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యుపి స్కూల్ హెచ్‌ఎం మహమ్మద్ రఫీ, టీచర్ ప్రభాకర్, గ్రంథాలయ అధికారి మల్లికార్జున, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి విజయ్ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్, కవి, రచయిత శౌంఠి జయప్రకాష్, సాహితీ ప్రేమికులు గంగాధర్, రినౌన్డ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల సాఖిబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో..


గోరంట్లలో..


కొత్తచెరువులో..


హిందూపురంలో..

అక్రమంగా పేలుడు పదార్థాల నిల్వ.. ఒకరి అరెస్టు

కదిరి టౌన్ : పేలుడుకి ఉపయోగించే వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచిన ముగ్గురిపై కేసులు నమోదు చేసి, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. అందిన సమాచారం మేరకు దాడులు చేసి కుటాగుళ్ల గ్రామ శివారులోని శివ సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన క్వారీ వద్ద అక్రమంగా పేలుడు స్వభావము గల సుమారు ఒక కిలో పదార్థాలను నిల్వ ఉంచినట్లు గుర్తించామన్నారు. క్వారీ యజమానులు కెవి.సాయిప్రణీత్‌రెడ్డి, శివగోవిందరెడ్డి, క్వారీ సూపర్‌వైజర్ ఎలికే చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి, ఎలికే చంద్రశేఖర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే కంప్రెసర్ ట్రాక్టర్, 100 మీటర్ల కేబుల్ వైరు, డ్రిల్లింగ్ మిషెన్, పేల్చేందుకు ఉపయోగించే మెక్కర్ బాక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రయివేటు ఫైనాన్స్ ప్రతినిధుల దౌర్జన్యం

సోమందేపల్లి : రికవరీలో భాగంగా ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది కస్టమర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేయడం లాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. వివరాలు.. తన భర్త చేసిన అప్పు చెల్లించాలని శుక్రవారం ఓ ప్రయివేట్ ఫైనాన్స్ సిబ్బంది తన పట్ల అసభ్యంగా ప్రవర్తించారని స్థానిక వాల్మీకి సర్కిల్‌లో హోటల్ నిర్వాహిస్తున్న బాధితురాలు వాపోయారు. మహిళ అని కూడా చూడకుండా నా బండి ఎక్కి కార్యాలయం దగ్గరకు రావాలని ఆమెను బెదిరించినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. స్థానికులు ప్రశ్నిస్తే మీరు అప్పు కట్టాలని వారి పట్ల కూడా దురుసుగా ప్రవర్తించినట్లు వాపోయారు. ప్రయివేట్ ఫైనాన్స్ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.


దౌర్జన్యం చేస్తున్న ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది

అంబులెన్స్, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

తాడిమర్రి : మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన శివయ్య, తిమ్మంపల్లి రాజు బైక్‌పై ముది గుబ్బ నుంచి చిల్లకొండయ్యపల్లి వైపు వస్తున్న సమయంలో బత్తలపల్లి మండలంలోని రామాపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ముదిగుబ్బ వైపు నుంచి అనంతపురం వెళ్తున్న అంబులెన్స్ వాహనం ఢీకొంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడగా స్థానికుడు కప్పల సుదర్శన్ బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

బత్తలపల్లి : మండలంలోని గంటాపురం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు చేసి పది మందిని అరెసు వారి నుంచి రూ. 98,456 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అందిన సమాచారం ధర్మవరం టూటౌన్ సిఐ రెడ్డెప్ప ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ సిబ్బంది, బత్తలపల్లి ఎస్ఐ నాగప్రసన్న, సిబ్బంది దాడులు చేసి 10 మంది పేకాట జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 98,456 నగదు, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

జవహర్‌లాల్ నెహ్రూకి ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ దేశానికి చేసిన సేవలను ప్రముఖులు కొనియాడారు.

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థులు విద్య పట్ల తప్ప ఎలాంటి ఆకర్షణలకు లోను కాకూడదని న్యాయమూర్తి లోకనాథం సూచించారు. పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన బాలికల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికల దినోత్సవం ఔన్నత్యాన్ని వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీచర్ రేణుక వందన సమర్పణ చేయగా న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీశాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో అధినేత మూమెంట్ సలీం బాషా ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రొద్దం : మండలంలోని శేషాపురం గ్రామంలో ఉన్న శ్రీసాయి జ్యోతి విద్యా విహార్ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ స్వతంత్ర భారతావనిని గాడిలో పెట్టడానికి, మార్గదర్శనం చేయడానికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు నెహ్రూ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : నేటి పిల్లలే దేశానికి భవిష్యత్తుగా మారతారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలి పారు. చెన్నేకొత్తపల్లిలో నిర్వహించిన 58వ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం కార్యక్ర మాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా చిన్నారులతో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, ప్రతిజ్ఞ చేయించారు.

పెనుకొండ టౌన్ : పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల్లో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు నెహ్రూ వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పిల్లలకు బహుమతులు ప్రదానం చేసి మిఠాయిల పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మంచివాణి, డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండలంలోని పుట్టపర్తి, వెంగళమ్మచెరువు, జగరాజుపల్లి మంగళకర పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. పుట్టపర్తి శివాలయం వీధిలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ-2 బొల్లె ప్రసాద్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ నెహ్రూ సేవలను వివరించారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం రజనీకాంత్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ వెంకటరత్నం బహుమతులు అందజేశారు.

ముదిగుబ్బ : స్థానిక పివిఎస్ పాఠశాలలో పాఠశాల ఛైర్మన్ పివి.నాయుడు ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పివి.నాయుడు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు అపారమన్నారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ వెంకటాచలపతి హాజరై ఆటల పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనీషా, పిఇటి జ్యోతియాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్మవరంలోని కాకతీయ పాఠశాలలో బాలల దినోత్సవం

అలాగే జడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. నెహ్రుకు



ముదిగుబ్బలో గులాబీ పువ్వు ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు

ఇష్టమైన గులాబీ పువ్వు ఆకారంలో పిల్లలు కూర్చొని ఆకట్టుకున్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్ పద్మ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


చెన్నేకొత్తపల్లిలో నెహ్రూచిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాలసునీత, విద్యార్థులు

డైరెక్టర్ శెట్టిపి సూర్య ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ తొలి ప్రధాని నెహ్రూకి పిల్లలంటే చాలా ఇష్టమని, అందుకే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నాగలూరు వద్ద ఉన్న పిసిఎంఆర్ పాఠశాలలో ఛైర్మన్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, డైరెక్టర్లు రూపా రాజా కృష్ణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ : మండలంలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం నారాయణ స్వామి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయలు, విద్యార్థులు కలిసి ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో గిరిజమ్మ, భారతి, కరుణకుమారి, రేష్మభాను, ఆనందమ్మ, నరేష్‌కుమార్, బాబు, చంద్రశేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్ రవి పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలోని కృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, బాలమోహన్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక శ్రీజ్యోతి, విజేత, విద్యాధరి, విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు లక్ష్మీనారాయణ, వెంకటరాముడు, లక్ష్మీ, కవిత అధ్యక్షతన బాలల దినోత్సవం నిర్వహిం చారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారులు నెహ్రూ వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక ఎంజెపి కళాశాలలో ప్రిన్సిపల్ వరలక్ష్మి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎస్ఎంసి ఛైర్మన్ జగదీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి : బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచి ఆదినారాయణ సొంత నిధులతో క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్ర మంలో హెచ్ఎం గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేంద్ర, శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఓబుళదేవరచెరువు మండలంలోని అచ్చామియాపల్లి ప్రాథమిక పాఠశాలలో..

ఓబుళదేవరచెరువు : మండలంలోని అచ్చామియాపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం కట్టుబడి గౌస్ లాజమ్ దేశానికి నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలోని శ్రీజ్యోతిపాఠశాలలో బాలల దినోత్సవం



లేపాక్షిలో క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచి ఆదినారాయణ


పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..



ముదిగుబ్బలోని పివిఎస్ పాఠశాలలో బాలల దినోత్సవం

ముగ్గురిపై కేసు నమోదు

బెలుగుప్ప : భార్యపై అనుమానంతో భార్యను వేటకొడవలితో నరికిన కేసులో భర్త బోయ ఆంజనేయులుతోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ మహానంది తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బోయ ఆంజనయులు తన భార్య బోయ శాంతిపై అనుమానం పెంచుకుని గత శుక్రవారం రాత్రి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆంజనేయులుతోపాటు బోయ తిప్పేస్వామి, జయసింహను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బెలుగుప్ప విద్యార్థి

బెలుగుప్ప : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు బెలుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భరత్ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలపిఆరు. ఈ సందర్భంగా భరత్‌ను పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సరిత, స్కూల్ పాఠశాల కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ప్రజాశక్తి - అనంతపురం

స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో శుక్రవారం బి.యాలేరులో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి గాలివానలు, కరెంట్ షాక్, పిడుగులు, అగ్నిమాపక ప్రమాదాలు, పాముకాటు, వరద వంటి వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఎ.రేణుకమ్మ, ఉప సర్పంచు ఎ.ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, హెచ్ఎం చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.